కత్తిరించడం వల్ల
పూల మొక్క
మరింత బలంగా
ఎదిగినట్టు
విమర్శల
వల్ల మనలో
నూతన శక్తి
బయటికొస్తుంది.
ప్రతి విమర్శ నుంచీ
ఏదో ఒక విషయం
నేర్చుకోవాల్సిందే.

DD9 వార్త
తెలుగు దినపత్రిక

**స్టార్ హీరోపై కేసు వేయనున్న డైరెక్టర్?**

**కోలీవుడ్‌లో కలకలం రేపుతున్న 'కరుప్పు' వివాదం!**



సంపుటి : 01 సంచిక : 200 హైదరాబాద్, మార్చి, మంగళవారం 10, 2026 పేజీలు : 06 వెల : 3.00



# ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణ

**అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ వర్సిటీ**

**అందుబాటులోకి ఆధునిక మైదానాలు**

**నగరంలో ఇతర స్టేడియాల అభివృద్ధి**

**క్రీడా శాఖ అధికారులకు సీఎం దిశా నిర్దేశం**

**రాష్ట్ర నుంచి ప్రపంచ స్థాయి క్రీడాకారులే లక్ష్యం**

**చదువుతో పాటు క్రీడ శిక్షణ సమన్వయం**

**సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల రంగంలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో ఒలింపిక్స్ వంటి అంత ర్జాతీయ క్రీడా పోటీల్లో తెలంగాణ క్రీ డాకారులు సత్తా చాటేలా ప్రత్యేకంగా శిక్షణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతో కూడిన ఆధునిక స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు, శిక్షణా సదుపాయాలు, ఆధునిక మైదానాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని క్రీడాశాఖ అధికారులకు ఆదేశించారు.ఈ మేరకు క్రీడాశాఖకు సంబంధించిన ..మిగతా 3లో

# ఆడబిడ్డల కన్నీళ్లు మంచిది కాదు

**వెలుగుమట్ల బాధితులకు అండగా ఉంటాం**

**బాధితులకు తక్షణం ఆర్థిక సహాయం చేయాలి**

**ప్రభుత్వ వైఖరి అభ్యంతరకరంగా ఉంది**

**నిర్వాసితులకు ఇండ్లు కట్టించి ఇవ్వాలి**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్**

**వెలుగు మట్ల నిర్వాసితులకు కలిసి కవిత నిరసన**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఖమ్మం జిల్లాలో ఇటీవల సంచలనం రేపిన వెలుగు మట్ల ఘటనపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగేంత వరకు తాము అండగా ని లుస్తామని ఆమె స్పష్టం చేశారు. సోమవారం ఆమె ఖమ్మం జిల్లాలో పర్యటించి ..మిగతా 2లో



## కవిత, కేజ్రీవాల్ కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

**సీబీఐ కేసులో నిందితులను విముక్తి చేసిన రౌస్ అవెన్యూ కోర్టు**

**కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన సీబీఐ**

**రివిజన్ పిటిషన్ పై వివరణ ఇవ్వాలంటూ నిందితులకు హైకోర్టు నోటీసులు**

02

## మీరు అసలు మనుషులేనారా.. వీటిని కూడా కల్తీ చేస్తారా..!



**గచ్చిబౌలిలో కల్తీ ఆహార పదార్థాల తయారీ గుట్టు రట్టు**

**గడువు ముగిసిన నూనెలతో మళ్లీ ప్యాకింగ్ చేసి విక్రయం**

**రూ.21 లక్షల విలువైన కల్తీ నూనె, గోధుమ పిండి స్వాధీనం**

**ఇద్దరు నిందితుల అరెస్ట్.. దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రోజురోజుకు ఎక్కడ చూసినా కల్తీ కాని ఆహారం పదార్థం ఉందా అని అనుమానా లు పెరుగుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే.. ..మిగతా 2లో

## రాహుల్ బంధు కింద ఢిల్లీకి రూ.1000 కోట్లు

**కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదన్న కేటీఆర్**

**ఇప్పుడు కోతల సమయం వచ్చినా రైతుబంధు పడలేదన్న కేటీఆర్**

**రుణమాఫీ చేశానని అనుకుంటున్నానని రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరమని వ్యాఖ్య**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

'రాహుల్ బంధు' పథకం కింద ప్రతి సంవత్సరం రూ.1000 కోట్లు ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడు కుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరో పించారు. సిరిసిల్లలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మా ట్లాడుతూ, కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదని, కానీ ఇప్పుడు కోతల సమయం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం వేయలేదని విమర్శించారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో రైతుబంధును నిలిపివేసి 'రాహుల్ బంధు' పేరుతో కొత్త పథకం తెచ్చారని ఎద్దేవా చేశారు. తన పదవిని కాపాడుకోవడం ..మిగతా 2లో

## తెలంగాణ రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం

**సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక**


**అధికారికంగా ప్రకటించిన ఎన్నికల అధికారి**

**రెండోసారి రాజ్యసభకు సింఘ్వీ**

**సీఎం సలహాదారు పదవికి వేం రాజీనామా**

**వివాదాలకు దూరంగా ఉంటానని హామీ**

**తెలంగాణ సమస్యలపై పోరాడతామని స్పష్టం**



02

## టీవీకే అధినేత విజయ్‌కి సీబీఐ సమన్లు

**మార్చి 10న విచారణకు హాజరుకావాలని ఆదేశం**

**కరూర్ తొక్కిసలాట కేసులో కీలక పరిణామం**

**మరింత లోతుగా విచారించనున్న దర్యాప్తు సంస్థ**

**సభకు పోలీసులు భద్రత కల్పించారా?**

**స్థానిక నేతలు బాధ్యతగా వ్యవహరించారా?**

**అన్న కోణంలో సాగనున్న సీబీఐ ఎంక్వైరీ !**



03

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి ఈవీ స్కూటర్ల హామీలా?

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్న సంజయ్**

**పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని సాకులు చెబుతున్నారని మండిపాటు**

**మూసీ ప్రాజెక్టు కోసం వేల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్న**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కాలేజీ విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు పంపిణీ చేస్తామని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసిం ది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం ఈ కీలక ప్రకటన చేయగా, దీనిపై కేంద్ర సహాయ మంత్రి ..మిగతా 2లో



## భారతీయుల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం

**విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడి**

**మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలపై పార్లమెంట్‌లో ప్రకటన**

**ప్రజల పరిస్థితిపై తీవ్ర ఆందోళన**

**ప్రధాని మోదీ పర్యవేక్షిస్తున్నారన్న మంత్రి**

**ఇంధన భద్రతపై ప్రభుత్వం అప్రమత్తం**

**ప్రపంచ శాంతికి కృషి చేయాలని పిలుపు**

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

పశ్చిమాసియా ప్రాంతంలో నెల కొన్న ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నా యని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. అక్కడి పరిస్థితులను భారత ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, పరిస్థి తులపై ఎప్పటికప్పుడు అంచనాలు వేస్తూ తగిన చర్యలు తీసుకుం టున్నామని చెప్పారు. సమస్యలు యుద్ధం ద్వారా కాకుండా చర్చలు, దౌత్యపరమైన ప్రయత్నాల ద్వారా పరిష్కారం కావాలని భారత్ విశ్వ సిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ ఉభయ సభల్లో పశ్చి మాసియా ..మిగతా 3లో



# తెలంగాణ రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం

- **సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక**
- **అధికారికంగా ప్రకటించిన ఎన్నికల అధికారి**
- **రెండోసారి రాజ్యసభకు సింఘ్వీ**
- **సీఎం సలహాదారు పదవికి వేం రాజీనామా**
- **వివాదాలకు దూరంగా ఉంటానని హామీ**
- **తెలంగాణ సమస్యలపై పోరాడతామని స్పష్టం**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రం నుంచి ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ మరియు వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణకు నిర్ణయించిన గడువు ముగిసిన తర్వాత ఈ ఇద్దరూ పోటీ లేకుండా గెలిచినట్లు అసెంబ్లీ ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వారి ఎన్నికను ధృవీకరిస్తూ నియామక పత్రాలను అందజేశారు.రాజ్యసభ సభ్యత్వం లభించిన నేపథ్యంలో వేం నరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. తనను రాజ్యసభకు ఎంపిక చేయడంలో సహకరించిన కాంగ్రెస్ పార్టీ నేతలందరికీ కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**కాంగ్రెస్ అభ్యర్థుల ఏకగ్రీవ ఎన్నిక**

ఈ రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున అభిషేక్ మను సింఘ్వీ మరియు వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థిగా సాయన్న కూడా నామినేషన్ సమర్పించారు. అయితే నామినేషన్ పరిశీలన సమయంలో సాయన్న సమర్పించిన పత్రాల్లో అవసరమైన పది మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడం బయటపడింది.నిబంధనలకు అనుగుణంగా సంతకాలు లేకపోవడంతో ఎన్నికల అధికారులు ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. దీంతో పోటీలో కాంగ్రెస్ అభ్యర్థులు మాత్రమే మిగిలారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సరికి మరెవరూ బరిలో లేకపోవడంతో అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటించారు.

**రెండోసారి రాజ్యసభకు సింఘ్వీ**

అభిషేక్ మను సింఘ్వీ దేశంలోని ప్రముఖ న్యాయవాదుల్లో ఒకరుగా పేరుపొందారు. ఆయన సుప్రీంకోర్టులో సీనియర్ అడ్వకేట్‌గా సేవలందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆయన చాలా కాలంగా న్యాయ సలహాదారుగా వ్యవహరిస్తున్నారు.ఇప్పటికే ఒకసారి రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన సింఘ్వీకి కాంగ్రెస్ పార్టీ మరోసారి అవకాశం కల్పించింది. ఏఐసీసీ కోటా కింద తెలంగాణ నుంచి ఆయనను రాజ్యసభకు పంపాలని పార్టీ నిర్ణయించింది. న్యాయ రంగంలో విశేష అనుభవం ఉన్న వ్యక్తిగా సింఘ్వీకి పార్టీ లోపల కూడా మంచి గౌరవం ఉంది. పార్లమెంట్‌లో చట్టపరమైన అంశాలపై లోతైన అవగాహనతో మాట్లాడగల నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. అందువల్ల కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభలో కీలక పాత్ర పోషించే అవకాశం ఆయనకు ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**వేం నరేందర్ రెడ్డికి సీఎం మద్దతు**

రాజ్యసభకు ఎన్నికైన మరో అభ్యర్థి వేం నరేందర్ రెడ్డి. ఆయనకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చెప్పుకుంటారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు నుంచే రేవంత్ రెడ్డికి నరేందర్ రెడ్డి మద్దతుగా నిలిచారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఈ నేపథ్యంలో ఆయనకు రాజ్యసభ సభ్యత్వం లభించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పార్టీ అంతర్గతంగా అనేక మంది ఆశావహులు ఉన్నప్పటికీ చివరికి నరేందర్ రెడ్డికే అవకాశం దక్కింది.

**సీఎం సలహాదారు పదవికి రాజీనామా**

వేం నరేందర్ రెడ్డి ఇటీవల వరకు ముఖ్యమంత్రి సలహాదారుగా పనిచేశారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఆ పదవికి రాజీనామా చేయాల్సి రావడంతో ఆయన ముందుగా రాజీనామా చేసి తరువాత నామినేషన్ దాఖలు చేశారు.కాంగ్రెస్ పార్టీలో రాజ్యసభ టికెట్ కోసం అనేక మంది నేతలు ప్రయత్నాలు చేశారు. మొత్తం 16 మంది వరకు సీనియర్ నాయకులు ఆశావహులుగా ఉన్నారని సమాచారం. అయినప్పటికీ పార్టీ అధిష్ఠానం చివరకు వేం నరేందర్ రెడ్డినే అభ్యర్థిగా ప్రకటించింది.ఈ నిర్ణయానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ వంటి నేతలు కూడా మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ విషయంలో కీలకంగా వ్యవహరించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం**

వేం నరేందర్ రెడ్డి మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామానికి చెందినవారు. ఆయన వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ప్రస్తుతం ఆయన వయస్సు 67 సంవత్సరాలు.రాజకీయాల్లో ఆయనకు నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. 2004లో మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో కూడా ఆయన పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పోటీ చేసి పరాజయం పాలయ్యారు.అయినా కూడా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు రాజ్యసభ సభ్యత్వం రావడం ఆయన రాజకీయ జీవితంలో కీలక మలుపుగా భావిస్తున్నారు.

**రేవంత్ రెడ్డితో సన్నిహిత అనుబంధం**

వేం నరేందర్ రెడ్డి మొదట నుంచి తెలుగుదేశం పార్టీలో రాజకీయ జీవితం ప్రారంభించారు. అదే సమయంలో రేవంత్ రెడ్డి కూడా టీడీపీలోనే ఉండడంతో ఇద్దరి మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి.తరువాత ఇద్దరూ కాంగ్రెస్ పార్టీలో చేరిన తరువాత కూడా వారి అనుబంధం కొనసాగింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి జరిగిన రాజకీయ పోరాటంలో నరేందర్ రెడ్డి కూడా చురుకుగా పాల్గొన్నారు.ఆర్థిక సహాయం నుంచి ప్రారంభించి వివిధ కార్యక్రమాల్లో రేవంత్ రెడ్డికి ఆయన మద్దతుగా నిలిచినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే ఆయనకు ఇప్పుడు రాజ్యసభ సభ్యత్వం లభించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**మీడియాతో వేం నరేందర్ రెడ్డి**

రాజ్యసభకు ఎన్నికైన అనంతరం వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ధృవీకరణ పత్రం అందుకున్న తర్వాత ఆయన మీడియా ప్రతినిధులతో తన అభిప్రాయాలను పంచుకున్నారు.తాను ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తినని చెప్పారు. పార్టీ ప్రయోజనాలే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డితో తనకు స్నేహ సంబంధాలు ఉన్నాయని ఆయన అంగీకరించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాల గురించి తనకు పెద్దగా తెలియదని చెప్పారు.తనకు కొత్త విషయాలు నేర్చుకోవడం అంటే ఎంతో ఇష్టమని కూడా ఆయన అన్నారు. ఇప్పటి వరకు తన పని విధానం ఒకలా ఉండేదని, ఇకపై పార్లమెంట్ వేదికపై మరో విధంగా పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు.

**తెలంగాణ సమస్యలపై రాజ్యసభలో పోరాటం**

2004 నుంచి 2009 వరకు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం తనకు ఉందని వేం నరేందర్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఇకపై పార్లమెంట్ వేదికగా తెలంగాణ ప్రజల సమస్యలను ప్రస్తావిస్తానని చెప్పారు.రాజ్యసభలో తెలంగాణకు సంబంధించిన అంశాలను బలంగా ప్రస్తావించి పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తన శక్తివంచన లేకుండా పనిచేస్తానని హామీ ఇచ్చారు. రాజ్యసభ సభ్యత్వం కల్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి మరోసారి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచిన పార్టీకి తగిన విధంగా సేవ చేస్తానని చెప్పారు.మొత్తంగా తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఈ ఇద్దరు నేతలు పార్లమెంట్‌లో తెలంగాణ తరఫున కీలకంగా వ్యవహరించే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆడబిడ్డల కన్నీళ్లు మంచిది కాదు

మొదటిపేజీ తరువాయి

వెలుగుమట్ల బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బాధితులకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

ఖమ్మం నగరంలోని అంబేద్కర్ లో వెలుగుమట్ల ఘటనకు సంబంధించిన బాధితులతో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక పరిస్థితి గురించి వివరాలు సేకరించారు. ఈ ఘటన కారణంగా చాలా మంది తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నారని బాధితులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కొందరు ఇప్పటికీ వైద్య చికిత్స పొందుతున్నారని, ఆర్థికంగా కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కవిత వారికి ధైర్యం చెబుతూ అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

బాధితులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత ప్రభుత్వ వైఖరిపై విమర్శలు గుప్పించారు. ఘటన జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు బాధితులకు ప్రభుత్వం సరైన సహాయం అందించలేదని ఆమె ఆరోపించారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా అవసరమైన వైద్య సేవలు కూడా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వెంటనే వైద్య సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వ తరఫున సరైన చర్యలు కనిపించలేదని విమర్శించారు. బాధితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కవిత వ్యాఖ్యానించారు.

**ధర్నాకు దిగిన కవిత**

బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కవిత అనంతరం ఖమ్మం నగరంలో ఆందోళన చేపట్టారు. ఖమ్మంలోని ఖమ్మం జేపీ జంక్షన్ వద్ద ఆమె నిరసన కార్యక్రమం నిర్వహించారు. బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వెలుగుమట్ల బాధితులకు తక్షణ న్యాయం చేయాలని నినాదాలు చేశారు. బాధితులకు ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం ప్రకటించాలని, అవసరమైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. జడ్పీ కూడలిలో కవిత ధర్నాకు దిగడంతో అక్కడ భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించడంతో ఇరువైపులా వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. ముఖ్యంగా నగరంలోకి వచ్చే ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నెమ్మదించింది. దీంతో వాహనదారులు కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

**పోలీసుల జోక్యం**

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించిన అనంతరం కవితతో మాట్లాడి పరిస్థితిని సర్దిచెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరసన కార్యక్రమాన్ని ముగించాలని పోలీసులు కోరారు. పోలీసుల విజ్ఞప్తిని గౌరవించిన కవిత కొంతసేపటి తరువాత తన నిరసనను విరమించుకున్నారు. అనంతరం బాధితులతో కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ వెలుగుమట్ల ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు సరైన న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. బాధితులకు ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా దీర్ఘకాలిక వైద్య సహాయం కూడా అందించాలని ఆమె సూచించారు. బాధితులు మళ్లీ సాధారణ జీవితానికి తిరిగి వచ్చేలా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

**తెలంగాణ జాగృతి అండ**

బాధితులకు తెలంగాణ జాగృతి సంస్థ అన్ని విధాలుగా అండగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. అవసరమైతే మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. బాధితుల కోసం న్యాయపరమైన సహాయం అందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వెలుగుమట్ల ఘటనపై రాజకీయంగా కూడా చర్చ కొనసాగుతోంది. వివిధ రాజకీయ పార్టీలు ఈ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. బాధితులకు తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కవిత చేసిన పర్యటన, నిర్వహించిన నిరసన కార్యక్రమం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీసింది. బాధితులకు ప్రభుత్వం ఎలాంటి సహాయం అందిస్తుంది, ఈ ఘటనపై తదుపరి చర్యలు ఏమిటన్న అంశాలపై ఆసక్తి నెలకొంది. వెలుగుమట్ల ఘటనలో బాధితులు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం గుర్తించి తగిన చర్యలు తీసుకుంటుందనే ఆశతో ఉన్నారు. కవిత పర్యటనతో ఈ సమస్య మళ్లీ ప్రధాన చర్చగా మారింది. బాధితులకు సరైన న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కూడా కోరుతున్నారు. ఈ ఘటనపై ప్రభుత్వ నిర్ణయాలు ఏమిటన్నది ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

# రాహుల్ బంధు కింద ఢిల్లీకి రూ.1000 కోట్లు

మొదటిపేజీ తరువాయి



కోసం రేవంత్ రాహుల్ బంధు పథకం కింద గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తున్నాడని ఆరోపించారు. అందుకే కేసీఆర్ ముందే చెప్పారని, ఆలోచించి జాగ్రత్తగా ఓటు వేయాలని సూచించారని తెలిపారు. రేవంత్ రెడ్డి మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారని విమర్శించారు.

"నేను రుణమాఫీ చేశానని అనుకుంటున్నా, రైతుబంధు వేశానని అనుకుంటున్నా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల అన్నారని, అసలు ఆయన ముఖ్యమంత్రేనా అని నిలదీశారు. మరి ముఖ్యమంత్రిగా మీరెందుకు ఉన్నారని ప్రశ్నించారు. రైతుబంధు వేస్తే, రుణమాఫీ ఇస్తే మీకు తెలియకుండా ఉండటమేమిటని అన్నారు. హైదరాబాద్‌లో దోమలు బాగా పెరిగిపోయాయని, కానీ నగరంలో చెత్తను మాత్రం తీయడం లేదని విమర్శించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి ఈవీ స్కూటర్ల హామీలా?

మొదటిపేజీ తరువాయి



బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు ఎటు వెళుతున్నాయో అర్థం కావడం లేదని ఆయన మండిపడ్డారు.

బండి సంజయ్ తన విమర్శల్లో ప్రధానంగా కాలేజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రస్తావించారు. ఓవైపు వేల కోట్ల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయని, దీని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే... మరోవైపు, అవేమీ పట్టించుకోకుండా ఉచిత ఈవీ స్కూటర్లు ఇస్తామని వాగ్దానాలు చేయడం ప్రజలను వంచించడమేనని ధ్వజమెత్తారు. దళితులు, గిరిజనులకు పంపిణీ చేయడానికి భూములు లేవని చెబుతున్న ప్రభుత్వం, జర్నలిస్టులు, మూసీ బాధితులకు ఫ్యూచర్ సిటీలో స్థలాలు ఎలా ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని సాకులు చెబుతున్నారని... మరి, మూసీ ప్రాజెక్టు కోసం వేల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని నిలదీశారు.

రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు దోమల బెడద పెరిగిందని... ప్రజలు తమ పని తాము చేసుకుంటున్నా, కాంగ్రెస్ నేతలు దోమల్లా వచ్చి ఇబ్బంది పెడుతున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# మీరు అసలు మనుషులేనారా.. వీటిని కూడా కల్తీ చేస్తారా..!

మొదటిపేజీ తరువాయి

ఎక్కడ చూసినా ఆహార పదార్థాలను కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వ్యాపారం చేస్తున్నారు దుర్మార్గులు. కనీస మానవత్వం కూడా లేకుండా ధనార్జనే లక్ష్యంగా ఈ కల్తీదందా నడుస్తోంది. వివరాల్లోకి వెళితే.. గచ్చిబౌలి పరిధిలో కల్తీ నూనెలు, గోధుమ పిండి తయారీ గుట్టు రట్టు చేశారు SOT పోలీసులు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న ముఠాను మాదాపూర్ SOT పోలీసులు పట్టుకున్నారు. శేరిలింగంపల్లి SOT టీమ్ గచ్చిబౌలి పరిధిలోని వట్టి నాగులపల్లి ఇందిరమ్మ కాలనీలో ఉన్న శ్రీ జస్నాత్ ట్రేడర్స్ అనే దుకాణంపై దాడి నిర్వహించారు.

దాడిలో రాజస్థాన్‌కు చెందిన దుకాణ యజమాని గడువు ముగిసిన వివిధ కంపెనీల వంట నూనెలను సేకరించి, వాటిని సోయాబీన్ నూనెతో కలిపి గోల్డ్ ఫేస్ లైట్, రాజ్ గోల్డ్ పామ్ ఆయిల్, గోల్డ్ డ్రై, గోల్డ్ ఫ్రెష్, హెల్త్ కేర్, నంది ప్యూర్ పూజా ఆయిల్ వంటి పేర్లతో మళ్లీ ప్యాకింగ్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అదేవిధంగా పలు కంపెనీలకు చెందిన గడువు ముగిసిన గోధుమ పిండిని సేకరించి జస్నాత్ గోల్డ్ చక్కి అట్టా పేరుతో తిరిగి ప్యాక్ చేసి అమ్ముతున్నట్లు బయటపడింది.

ఈ దాడిలో పోలీసులు మొత్తం 5,026 లీటర్ల కల్తీ వంట నూనె (సుమారు రూ.10,55,460 విలువ) , 5,192 కిలోల గోధుమ పిండి (సుమారు రూ.3,11,520 విలువ) స్వాధీనం చేసుకున్నారు. ఇవి కాకుండా ఒక వెయింగ్ మెషిన్, ఒక ఆయిల్ ఫిల్టర్ మెషిన్, ఒక గోధుమ ఫిల్టర్ మెషిన్, ఖాళీ సంచులు, రెండు మొబైల్ ఫోన్లు , TS07UL2884 నంబర్ టెంపో ట్రాలీ ఆటోను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న మొత్తం వస్తువుల విలువ రూ.21,91,980గా అంచనా వేశారు. ఈ కేసులో రాజస్థాన్‌కు చెందిన భన్వర్ రామ్ జాట్ (46) అతని కుమారుడు, అశోక్ కుమార్ (22)లను పోలీసులు అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్న వస్తువులతో పాటు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# కవిత, కేజ్రీవాల్ కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు




- **సీబీఐ కేసులో నిందితులను విముక్తి చేసిన రౌస్ అవెన్యూ కోర్టు**
- **కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన సీబీఐ**
- **రివిజన్ పిటిషన్ పై వివరణ ఇవ్వాలంటూ నిందితులకు హైకోర్టు నోటీసులు**

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ మళ్లీ కీలక మలుపు తిరిగింది. ఫిబ్రవరి 27న రౌస్ అవెన్యూ కోర్టు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మందిని ఈ కేసు నుండి విముక్తి చేస్తూ తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. ఈ క్రమంలో సీబీఐ పిటిషన్ పై ఈరోజు హైకోర్టు విచారణ జరిపింది.

ఈ విచారణలో భాగంగా ధర్మాసనం కేజ్రీవాల్, కవిత, సిసోడియాతో పాటు మిగిలిన నిందితులందరికీ నోటీసులు జారీ చేసింది. సీబీఐ దాఖలు చేసిన ఈ రివిజన్ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. విచారణ సందర్భంగా సీబీఐ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ... విచారణాధికారిపై కోర్టు చేసిన వ్యాఖ్యలు దర్యాప్తు సంస్థల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు, దర్యాప్తు సంస్థ, విచారణాధికారిపై ట్రయల్ కోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలపై స్టే విధిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

అంతేకాకుండా, సీబీఐ కేసులో నిందితులు విడుదలయ్యారు కాబట్టి ఈడీ దాఖలు చేసిన మనీ లాండరింగ్ కేసు విచారణను కూడా నిలిపివేయాలని నిందితుల తరఫు న్యాయవాదులు కోరగా.. హైకోర్టు భిన్నంగా స్పందించింది. సీబీఐ రివిజన్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు మనీ లాండరింగ్ కేసు విచారణను వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు సూచించింది. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# టీవీకే అధినేత విజయ్‌కి సీబీఐ సమన్లు

- మార్చి 10న విచారణకు హాజరుకావాలని ఆదేశం
- కరూర్ తొక్కిసలాట కేసులో కీలక పరిణామం
- మరింత లోతుగా విచారించనున్న దర్యాప్తు సంస్థ
- సభకు పోలీసులు భద్రత కల్పించారా?
- స్థానిక నేతలు బాధ్యతగా వ్యవహరించారా?
- అన్న కోణంలో సాగనున్న సీబీఐ ఎంక్వైరీ !

**తమిళనాడు, (డిడి9 వార్త):**

తమిళనాడులో సంచలనం రేపిన కరూర్ తొక్కిసలాట ఘటన కేసులో దర్యాప్తు మరోసారి కీలక మలుపు తిరిగింది. ఈ ఘటనకు సంబంధించి టీవీకే పార్టీ అధినేత, ప్రముఖ సినీ నటుడు విజయ్ కి సీబీఐ మరోసారి సమన్లు జారీ చేసింది. మార్చి 10న విచారణకు హాజరుకావాలని దర్యాప్తు సంస్థ ఆదేశించింది. కరూర్‌లో జరిగిన భారీ ప్రజాసభలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనపై విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమన్లు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**కరూర్ సభలో విషాద ఘటన**

గతేడాది సెప్టెంబర్ 27న తమిళనాడులోని Karur నగరంలో టీవీకే పార్టీ ఆధ్వర్యంలో భారీ ప్రజాసభ నిర్వహించబడింది. ఆ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు మాత్రమే కాకుండా వేలాదిమంది అభిమానులు, స్థానిక ప్రజలు కూడా భారీగా తరలివచ్చారు. సభలో నటుడు విజయ్ పాల్గొనడం వల్ల అభిమానుల ఉత్సాహం మరింత పెరిగింది. అయితే సభ ప్రారంభానికి ముందే వేదిక వద్దకు భారీగా జనసందోహం చేరుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఒక్కసారిగా జనాలు ముందుకు దూసుకెళ్లడంతో తీవ్ర తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో అనేక మంది తీవ్రంగా గాయపడగా, ఆసుపత్రికి తరలించిన వారిలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తమిళనాడులోనే కాకుండా దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది.

**సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు**

ప్రాథమికంగా ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఘటన తీవ్రత దృష్ట్యా, అలాగే బాధిత కుటుంబాల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పలు వర్గాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో విషయం సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లింది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును సీబీఐకి అప్పగించారు. అనంతరం సీబీఐ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఘటనపై సమగ్ర దర్యాప్తు ప్రారంభించింది. సభ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, అనుమతుల ప్రక్రియ, భద్రతా చర్యలు, జనసందోహ నియంత్రణ వంటి అంశాలపై అధికారులు లోతుగా విచారణ చేపడుతున్నారు.

**ఇప్పటికే పలుమార్లు విచారణకు హాజరు**

కరూర్ ఘటనకు సంబంధించి టీవీకే అధినేత విజయ్ ఇప్పటికే పలుమార్లు సీబీఐ ఎదుట విచారణకు హాజరయ్యారు. ముఖ్యంగా సభ నిర్వహణలో పార్టీ పాత్ర, కార్యక్రమానికి తీసుకున్న భద్రతా ఏర్పాట్లు, ప్రజల రాకపోకలను నియంత్రించేందుకు చేపట్టిన చర్యలపై దర్యాప్తు అధికారులు ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం.

విజయ్ ఢిల్లీలోని సీబీఐ కార్యాలయానికి వెళ్లి పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. సభ నిర్వహణకు సంబంధించిన పత్రాలు, అనుమతులు, కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు ఎవరి వద్ద ఉన్నాయనే అంశాలపై కూడా అధికారులు వివరాలు సేకరించారు.

**మరోసారి సమన్లు ఎందుకు?**

ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, సాక్ష్యాల ఆధారంగా మరికొన్ని అంశాలపై స్పష్టత అవసరమని సీబీఐ భావిస్తోంది. ముఖ్యంగా సభ నిర్వహణ సమయంలో జన సమూహాన్ని నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు, పోలీసులకు లేదా స్థానిక అధికారులకు ఎలాంటి సమాచారం ఇచ్చారు, కార్యక్రమానికి అనుమతులు ఎలా పొందారు అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఈ నేపథ్యంలో విజయ్ నుంచి మరింత వివరణ అవసరమని భావించిన సీబీఐ అధికారులు ఆయనకు మరోసారి సమన్లు జారీ చేసినట్లు వెల్లడించారు. మార్చి 10న విచారణకు హాజరై మరిన్ని వివరాలు అందించాలని సూచించారు.

**సభ అనుమతులపై విచారణ**

ఈ కేసులో ప్రధానంగా సభ నిర్వహణకు సంబంధించిన అనుమతుల అంశం కీలకంగా మారింది. సభకు ఎన్ని మంది హాజరవుతారని అంచనా వేశారు, జన సందోహాన్ని నియంత్రించేందుకు ఏ విధమైన ఏర్పాట్లు చేశారు, పోలీసు బందోబస్తు ఎంత మేర ఏర్పాటు చేశారు వంటి అంశాలను సీబీఐ పరిశీలిస్తోంది. అలాగే సభ నిర్వహణకు సంబంధించి టీవీకే పార్టీ బాధ్యతలు ఎంతవరకు ఉన్నాయి, స్థానిక నిర్వాహకులు తీసుకున్న చర్యలు ఏమిటి అనే విషయాలపై కూడా విచారణ కొనసాగుతోంది.

**ప్రభుత్వం, పార్టీ వాదనల పరిశీలన**

ఈ ఘటనపై తమిళనాడు ప్రభుత్వ వర్గాలు, టీవీకే పార్టీ నాయకులు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. సభకు భారీగా ప్రజలు రావడంతో పరిస్థితి అదుపు తప్పిందని కొందరు పేర్కొనగా, సరైన ఏర్పాట్లు లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని మరికొందరు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల వాదనలను సీబీఐ అధికారులు పరిశీలిస్తున్నారు. సభకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు, సాక్షుల వాంగ్మూలాలు, అధికారుల నివేదికలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు న్యాయం కోసం పోరాటం కొనసాగిస్తున్నాయి. బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనలో జరిగిన నిర్లక్ష్యంపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సీబీఐ దర్యాప్తు పూర్తయ్యాక నిజాలు వెలుగులోకి వస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**రాజకీయంగా కూడా చర్చ**

కరూర్ తొక్కిసలాట ఘటన తమిళనాడు రాజకీయాల్లో కూడా పెద్ద చర్చకు దారితీసింది. ముఖ్యంగా విజయ్ రాజకీయ రంగ ప్రవేశం చేసిన తర్వాత జరిగిన ఈ ఘటన రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

టీవీకే పార్టీ కార్యక్రమాలకు భారీగా ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు సేకరించిన ఆధారాలను పరిశీలిస్తూ సీబీఐ అధికారులు దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నారు. అవసరమైతే మరికొంతమందిని కూడా విచారణకు పిలిచే అవకాశం ఉందని సమాచారం.

విజయ్ విచారణకు హాజరైన తర్వాత కేసు దర్యాప్తులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో కరూర్ తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు ఎలాంటి మలుపు తిరుగుతుందన్నదానిపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.



# ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో నిర్మించనున్న "యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ" ప్రాజెక్టుపై విస్తృతంగా చర్చ జరిగింది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా క్రీడా మైదానాలు, శిక్షణ కేంద్రాలు, విద్యా సదుపాయాలు ఉండేలా యూనివర్సిటీ నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం సూచించారు.



**అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీ**

సమీక్షా సమావేశంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణానికి సంబంధించి అధికారులు రూపొందించిన పలు డిజైన్‌లను ముఖ్యమంత్రి పరిశీలించారు. మైదానాల నిర్మాణం నుంచి హాస్టల్ సదుపాయాల వరకు అన్ని అంశాలను జాగ్రత్తగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారు చేసేలా యూనివర్సిటీ ప్రణాళికలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారుల శిక్షణకు అవసరమైన అన్ని ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. క్రీడాకారులకు నివాస సదుపాయాలు, వ్యాయామశాలలు, శారీరక సామర్థ్యాన్ని పెంపొందించే ప్రత్యేక శిక్షణ కేంద్రాలు, వైద్య సదుపాయాలు వంటి అంశాలు ఉండాలని తెలిపారు. క్రీడాకారులు చదువుతో పాటు శిక్షణను సమన్వయం చేసుకునేలా విద్యా కార్యక్రమాలను కూడా రూపొందించాలని సూచించారు.

**గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధికి ప్రణాళిక**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న స్టేడియాన్ని ఆధునికీకరించడంతో పాటు అక్కడ ఇండోర్ స్టేడియం కూడా నిర్మించాలని చెప్పారు. స్టేడియం ఆవరణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రణాళికలో భాగంగా క్రీడాకారుల కోసం హాస్టల్ భవనాలు, వివిధ క్రీడల కోసం ప్రత్యేక మైదానాలు, శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేలా గచ్చిబౌలి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఆయన తెలిపారు.

**నగరంలోని ఇతర స్టేడియాల ఆధునీకరణ**

హైదరాబాద్ నగరంలోని పలు ప్రముఖ స్టేడియాలను కూడా ఆధునీకరించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్‌నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఈ స్టేడియాల్లో క్రీడాకారులకు మెరుగైన శిక్షణ సదుపాయాలు కల్పించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేలా మౌలిక వసతులను మెరుగుపరచాలని సీఎం చెప్పారు. క్రీడాకారుల ప్రతిభను పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక వసతులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఒలింపిక్స్ లక్ష్యంగా ప్రణాళిక**

తెలంగాణ రాష్ట్రం నుంచి భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్‌వెల్త్ వంటి అంతర్జాతీయ పోటీల్లో ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. క్రీడాకారుల ప్రతిభను చిన్న వయస్సులోనే గుర్తించి వారికి సరైన శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ప్రతి జిల్లాలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వంటి చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి కోచ్‌లను తీసుకువచ్చి శిక్షణ ఇవ్వాలని కూడా ఆయన సూచించారు.

**హైదరాబాద్ అభివృద్ధిపై సీఎం దృష్టి**

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగర అభివృద్ధిపై కూడా మాట్లాడారు. హైదరాబాద్ దేశంలో అత్యంత పురాతన మరియు ప్రాముఖ్యత కలిగిన నగరాల్లో ఒకటని అన్నారు. ఈ నగరానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను కాపాడుతూ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన చెప్పారు. బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను పూర్తి చేశామని తెలిపారు. అలాగే బూమ్‌రుక్న్‌ఉద్‌దౌలా చెరువు అభివృద్ధి పనులు కూడా చేపట్టినట్లు వివరించారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతాలను ఇప్పుడు అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ పాత నగర అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయడానికి సిద్ధంగా ఉందని సీఎం తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు పరిశీలించాలని, ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు.

**రంజాన్ శుభాకాంక్షలు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అధికారులు కూడా సమావేశంలో పాల్గొని ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలు సమర్పించారు.

**మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్ ప్రారంభం**

హైదరాబాద్ గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహిస్తున్న మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ టోర్నమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత్ మరియు ఉరుగ్వే జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. వచ్చే ఆగస్టులో బెల్జియం మరియు నెదర్లాండ్స్‌లో జరగనున్న మహిళల హాకీ ప్రపంచకప్‌కు అర్హత సాధించే క్రమంలో ఈ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. మార్చి 8 నుంచి 14 వరకు ఈ టోర్నమెంట్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఎనిమిది దేశాల జట్లు పాల్గొంటున్నాయి. గ్రూప్ ఏలో ఆస్ట్రియా, ఇంగ్లండ్, ఇటలీ, కొరియా జట్లు ఉన్నాయి. గ్రూప్ బీలో భారత్, స్కాట్‌లాండ్, ఉరుగ్వే, వేల్స్ జట్లు పోటీపడుతున్నాయి.

**క్రీడలకు ప్రాధాన్యత**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి పోటీలను రాష్ట్రంలో నిర్వహించడం ద్వారా క్రీడలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వం అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మ్యాచ్‌ను వీక్షించారు. ఇలా తెలంగాణలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భవిష్యత్తులో రాష్ట్ర క్రీడాకారులకు కొత్త అవకాశాలు కల్పిస్తాయని అధికారులు భావిస్తున్నారు.

# భారతీయుల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి**

పరిస్థితులపై జైశంకర్ కీలక ప్రకటన చేశారు.

**పార్లమెంట్‌లో విదేశాంగ మంత్రి ప్రకటన**

సోమవారం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాజ్యసభ మరియు లోక్‌సభలో పశ్చిమాసియా పరిస్థితులపై విదేశాంగ మంత్రి జైశంకర్ వివరాలు వెల్లడించారు. ఆ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితులు ప్రపంచ శాంతికి ముప్పుగా మారే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. సంబంధిత అన్ని శాఖలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రధాని సూచించినట్లు తెలిపారు. ప్రపంచంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు ఏర్పడితే దాని ప్రభావం అనేక దేశాలపై పడుతుందని జైశంకర్ పేర్కొన్నారు. ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతం అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన సరఫరాలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన వివరించారు. అందువల్ల అక్కడి పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండేందుకు అన్ని దేశాలు శాంతియుత మార్గాలను అనుసరించాలని భారత్ కోరుతోందని చెప్పారు.

**భారతీయుల భద్రతపై ప్రత్యేక దృష్టి**

పశ్చిమాసియా దేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రత మరియు సంక్షేమం ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని జైశంకర్ స్పష్టం చేశారు. గల్ఫ్ ప్రాంతాల్లో సుమారు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారని తెలిపారు. వారందరి భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తోందని చెప్పారు. ఇప్పటికే పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంతో అక్కడి నుంచి భారతీయులను స్వదేశానికి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జైశంకర్ వెల్లడించారు. ఇప్పటి వరకు సుమారు 67 వేల మంది భారతీయులు భారత్‌కు తిరిగి వచ్చారని తెలిపారు. అవసరమైతే మరిన్ని చర్యలు తీసుకుని మిగిలిన వారిని కూడా సురక్షితంగా తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. విదేశాల్లో ఉన్న భారతీయులకు సహాయం అందించేందుకు భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లు నిరంతరం పనిచేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే స్పందించేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు.

**ఇంధన భద్రతపై ప్రభుత్వం అప్రమత్తం**

పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని జైశంకర్ చెప్పారు. ఈ పరిస్థితి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే అవకాశముందని పేర్కొన్నారు. అయితే భారత వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. భారతదేశానికి అవసరమైన ఇంధన సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చమురు ధరలు నియంత్రణలో ఉండేలా దౌత్యపరంగా పలు దేశాలతో చర్చలు కొనసాగిస్తున్నామని తెలిపారు. భారతీయ వినియోగదారులపై అదనపు భారం పడకుండా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

**ఉద్రిక్తతలపై ముందుగానే భారత్ ఆందోళన**

పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగే అవకాశంపై భారత్ ముందుగానే ఆందోళన వ్యక్తం చేసినట్లు జైశంకర్ వెల్లడించారు. ఫిబ్రవరి 20న కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసి అన్ని పక్షాలు సహనంతో వ్యవహరించాలని కోరిందని చెప్పారు. అలాగే ఫిబ్రవరి 28న కూడా పరిస్థితులపై భారత్ తన ఆందోళనను స్పష్టంగా వ్యక్తం చేసిందని తెలిపారు. ఆ ప్రాంతంలో పెరుగుతున్న హింసాత్మక ఘటనలు, ప్రాణనష్టం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా ఇరాన్‌కు సంబంధించిన పరిణామాలు పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో శాంతియుత చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం లభిస్తుందని భారత్ విశ్వసిస్తోందని జైశంకర్ అన్నారు. అంతర్జాతీయ సమాజం కూడా శాంతి కోసం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

**ప్రతిపక్ష నిరసనలు**

పశ్చిమాసియా పరిస్థితులపై పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ జరపాలని కోరుతూ ప్రతిపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో పలువురు ప్రతిపక్ష ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వివరాలు వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. పశ్చిమాసియా పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. అందువల్ల పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ నిర్వహించాలని ప్రతిపక్ష నేతలు కోరారు.



**రాజ్యసభలో ఉద్రిక్తత**

రాజ్యసభలో జైశంకర్ ప్రకటన చేసేందుకు సభాపతి సీపీ రాధాకృష్ణన్ ఆయనను ఆహ్వానించారు. అయితే ఆ సమయంలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. పశ్చిమాసియాలో వేగంగా మారుతున్న పరిస్థితులపై స్వల్పకాలిక చర్చకు అవకాశం ఇవ్వాలని ఆయన అభ్యర్థించారు. అయితే ముందుగా విదేశాంగ మంత్రి ప్రకటనను వినాలని సభాపతి సూచించారు. జైశంకర్ ప్రకటన పూర్తయ్యాక ఖర్గే అభ్యర్థనపై స్పందిస్తామని తెలిపారు. దీంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది.

**ప్రతిపక్ష వాక్‌అవుట్**

జైశంకర్ ప్రసంగం ప్రారంభించిన వెంటనే కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్ష పార్టీల సభ్యులు లేచి నిలబడి ఖర్గేకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో పశ్చిమాసియా పరిస్థితులపై చర్చకు అనుమతి ఇవ్వాలని కూడా కోరారు. అయితే మంత్రి ప్రసంగం కొనసాగుతుండగానే ప్రతిపక్ష సభ్యులు నిరసనగా సభ నుంచి వాక్‌అవుట్ చేశారు. దీంతో కొంతసేపు సభలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**నడ్డా విమర్శలు**

ప్రతిపక్ష సభ్యుల వాక్‌అవుట్‌పై కేంద్ర మంత్రి జేపీ నడ్డా తీవ్రంగా స్పందించారు. విదేశాంగ మంత్రి కీలక ప్రకటన చేస్తున్న సమయంలో సభను వదిలి వెళ్లడం బాధ్యతారాహిత్య చర్య అని ఆయన విమర్శించారు. దేశానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రతిపక్షాలు సహకరించాల్సిన అవసరం ఉందని నడ్డా అన్నారు. కానీ ప్రతిసారీ గందరగోళం సృష్టించి సభ నుంచి వెళ్లిపోవడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో చర్చలు జరిగే సమయంలో మంత్రులు సమాధానాలు ఇస్తున్నప్పటికీ ప్రతిపక్షాలు తరచూ వాక్‌అవుట్ చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన అన్నారు.

**శాంతి కోసం భారత్ ప్రయత్నాలు**

పశ్చిమాసియా పరిస్థితులపై భారత్ సమతుల్య విధానాన్ని అనుసరిస్తోందని జైశంకర్ తెలిపారు. అన్ని దేశాలతో సానుకూల సంబంధాలను కొనసాగిస్తూ శాంతి స్థాపనకు కృషి చేస్తున్నామని చెప్పారు. భారతదేశం ఎప్పుడూ శాంతి, స్థిరత్వానికి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ శాంతికి ముప్పు కలిగించే సంఘటనలపై భారత్ ఎప్పటికప్పుడు స్పందిస్తూ దౌత్యపరమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పశ్చిమాసియా ప్రాంతంలో పరిస్థితులు త్వరగా సాధారణ స్థితికి రావాలని భారత్ ఆశిస్తున్నట్లు జైశంకర్ పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో శాంతి నెలకొంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కూడా లాభం చేకూరుతుందని ఆయన తెలిపారు. ఇకపై కూడా పరిస్థితులను నిశితంగా గమనిస్తూ భారత ప్రయోజనాలను కాపాడే చర్యలు కొనసాగిస్తామని విదేశాంగ మంత్రి స్పష్టం చేశారు.

# వైభవంగా ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు

- రెండో రోజు వేడుకల్లో పాల్గొన్న శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామి
- గరుడ ధ్వజారోహణ.. భక్తులకు గరుడ ప్రసాద వితరణ
- వేడుకల్లో ప్రముఖ సినీ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ రెడ్డి

**నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

ఇందూరు తిరుమల క్షేత్రంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు రెండో రోజు అత్యంత వైభవంగా జరిగాయి. సోమవారం ఉదయం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో శ్రీ శ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామి వారు పాల్గొని భక్తులకు ప్రవచనాలు అందించారు. ప్రముఖ సినీ నిర్మాతలు, ఆలయ ధర్మకర్తలు దిల్ రాజు, శిరీష్ రెడ్డిలు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవనాథ జీయర్ స్వామి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. భగవంతుడిపై పరిపూర్ణమైన నమ్మకం ఉంటే తీరని కోరికలంటూ ఏవీ ఉండవని అన్నారు. మానసా, వాచా, కర్మణా ఆ దేవదేవుడిని ఆశ్రయిస్తే ఈ కలికాలంలో ఎటువంటి ఇబ్బందులు దరిచేరవు. సాక్షాత్తు బ్రహ్మదేవుడే లోక కల్యాణం కోసం జరిపించేవే ఈ బ్రహ్మోత్సవాలు. భగవంతుడికి, భక్తుడికి మధ్య వారధి గరుత్మంతుడు. మన కోరికలను మనోవేగంతో ఆ స్వామికి చేరవేసే శక్తి గరుడుడికి ఉంది. గరుత్మంతుడికి అంతటి శక్తి, వేగం కేవలం తన తల్లి వినతపై ఉన్న భక్తి వల్లే లభించాయని స్వామి వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం అగ్నిదేవుడిని ఆహ్వానించి యాగ కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. వైనతేయ ఇష్టి కార్యక్రమాన్ని నిర్వహించి, గరుడధ్వజాన్ని ఆవిష్కరించారు. ఈ ధ్వజారోహణ ద్వారా సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం జరుగుతుందని అర్చకులు తెలిపారు. అనంతరం సంతానార్థులకు శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామి వారి హస్తాల మీదుగా గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. మధ్యాహ్నం తదియారాధనతో ఉదయపు క్రతువులు ముగిశాయి. ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్తలు నరసింహారెడ్డి, విజయసింహారెడ్డిలతో పాటు యజ్ఞాచార్యులు శ్రీనివాసాచార్య, లక్ష్మణాచార్య, శ్రీకరాచార్య, ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమారాచార్య పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, ఆలయ సేవకులు అశోక్, నరాల సుధాకర్, గంగాధర్, ప్రసాద్, రాజేశ్వర్, రమేష్ తదితరులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.









## టి ఎస్ యు టి ఎఫ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

**ఆదిలాబాద్ బ్యూరో (డిడి 9 వార్త న్యూస్ )**

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మొదటి దశ నిరసన కార్యక్రమంలో భాగంగా అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యు ఆర్ ఎస్ ) ఆదిలాబాద్‌లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవికాంత్ రెడ్డి, గణేష్, రాజన్న, హారిక మరియు బోధనేతర సిబ్బంది స్వప్న, రు తిక,పాల్గొని ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. సమ్మె కాలపు వేతనం మరియు పే స్కేల్ కల్పించాలని వారు కోరారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐక్యంగా పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమం ప్రశాంతంగా సాగింది.

## హనుమాన్ దీక్ష ఆచరించండి

- ఆత్మానందం పొందండి.
- హనుమాన్ గురుస్వామి బత్తుర్ శేఖర్

**బజార్హత్నూర్, మార్చి 9 (డిడి9న్యూస్):-**



హనుమాన్ను నిత్యం ఆరాధన చేసే భక్తులు హనుమాన్ జయంతికి ముందు దీక్షలు చేపట్టి భక్తితో ఆచరించి ఆత్మానందం పొందాలని బజార్ హత్నూర్ హనుమాన్ గురు స్వామి బత్తుర్ శేఖర్ సోమవారం తెలిపారు. బజార్ హత్నూర్ మండలం లోని హనుమాన్ స్వాములకు శ్రీ హనుమాన్ దీక్ష మాల ధారణ 21 రోజులకి తేదీ 10న మంగళవారం రోజున మాల ధారణ వేయవచ్చునని, 11 రోజుల మాల ధారణకు తేదీ 20 న శుక్రవారం రోజున మాల ధారణ వేయవచ్చునని హనుమాన్ గురుస్వామి వివరించారు. శ్రీరామనవమి వేడుకలు తేదీ 26 గురువారము రోజున జరుపబడునని, తేదీ 31 మంగళవారం రోజున శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు జరుపబడునన్నారు ఈ విషయాన్ని బజార్హత్నూర్ మండల ప్రజలు, స్థానిక ప్రజలు గమనించగలరని కోరారు.ఈ కింద ఇవ్వ బడిన శ్లోకం : శ్రీరామ రామ రామేతి రామే రామే మనోరమే! సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే అనేది అప్పుడు సీతామాత భక్తులకు చెప్పిన వేద మంత్రం. ఈ ఒక శ్లోకం ఒక సారి పాటించిన యెడల శ్రీ రాముని వేయి సార్లు జ్ఞాపకం చేసినంత అని అర్థం.

## ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం.

**బజార్ హత్నూర్, మార్చి 9(డిడి9 న్యూస్ ):-**

బజార్హత్నూర్ మండలంలోని ప్రతి గ్రామంలో నేటి నుంచి అనగామార్చి 10 వ మంగళవారం తేది నుంచి ఏప్రిల్ 9వ తేదీ గురువారం వరకు గ్రామాలలో రోజుకొక గ్రామము చొప్పున ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించబడునని బజార్హత్నూర్ పశువుల డాక్టర్ పర్వీద్ అహ్మద్ సోమవారం రోజు విలేకరులకు తెలిపారు ఈ అవకాశాన్ని పశుకాపరులు ఆయా గ్రామ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## సోనాల మండలంలో మెగా వైద్య శిబిరం

**ఆదిలాబాద్ జిల్లా,సోనాల మార్చి 9(డి డి 9) :-**


మండల కేంద్రంలో నేడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత మేఘ వైద్య శిబిరం ఏర్పాటు చేయనైనది ఇందులో భాగంగా ఆదిలాబాద్ రిమ్స్ నుండి ప్రత్యేక వైద్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ మండల ప్రాంతం నుంచి వచ్చిన పేషంట్లకు వైద్య సేవలు పలు సూచనలు మరికొందరికి రోగులకు కావలసిన మందులు పంపిణీ చేయడంతో పాటు రక్త నమూనాలను స్వీకరించి ల్యాబ్ లకు పంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య నిపుణులకు మరియు స్థానిక వైద్యునికి కాంగ్రెస్ పార్టీ సోనాల మండల పక్షాన వారికి చిరు సన్మానము చేయడంతో పాటు అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేయడమైనది ఇట్టి కార్యక్రమంలో సోనాల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న.మరియు సంఘపాల్. సర్పంచ్ రామదాసు, అమృత్ రావు, సోనాల పి హెచ్ సి సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.



## కొత్త కాలనీలో విద్యుత్ కోసం ప్రజల ఆవేదన... స్తంభాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం.

**బజార్హత్నూర్,మార్చి, 9(డిడి9వార్త ):-**

బజార్ హత్నూర్ మండల కేంద్రంలోని పులాజీ బాబా కాలనీ నుంచి ఎంపీడీఓ కార్యాలయం ముందర నూతనంగా ఏర్పడిన కాలనీ వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ లైన్ కల్పించాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు కాలనీ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలిసి విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌కు సోమవారం రోజు వినతిపత్రంఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ ఇప్పటి వరకు విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా కల్పించాలని అధికారులనుకోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆరే పాండు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





## కోటగిరిలో నూతన బస్టాండ్ నిర్మాణానికి భూమి పూజ

**కోటగిరి, మార్చి 09(డిడి9 వార్త):**

కోటగిరి మండల కేంద్రంలో నూతన బస్టాండ్ నిర్మాణానికి సోమవారం స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్భూమి పూజ నిర్వహించారు. గ్రామ ప్రజలు మరియు ఈ మార్గం గుండా ప్రయాణించే ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ బర్ల మధుకర్ మాట్లాడుతూ గ్రామంలో సరైన బస్టాండ్ సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా మల మూత్ర విసర్జన వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. నూతన బస్టాండ్ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు కావడం గ్రామ ప్రజలకు ఆనందకర విషయమని తెలిపారు.ఈ నిధులను మంజూరు చేయించిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నిర్మించబడే బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా నిర్మాణ పనులు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్ దేశాయ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టం మనోహర్, ఏఎంసి వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి, వార్డు సభ్యుడు వాజిద్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, గ్రామస్తులు శివచరణ్ పటేల్, గంగారం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## వంద శాతం పన్ను వసూళ్లే లక్ష్యం

- బోధన్‌లో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం
- అధికారులకు దిశానిర్దేశం చేసిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రావు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంచార్జి అదనపు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనంలో వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ అంశాలపై అధికారుల నుంచి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా మంజూరైన నిధులను ఎప్పటికప్పుడు గ్రామాల్లో అభివృద్ధి పనులకు వెచ్చించాలని, ఏ ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని హెచ్చరించారు. డిమాండ్, కలెక్షన్, బ్యాలెన్స్ నివేదికలను పరిశీలించిన ఆయన, పన్ను వసూళ్లలో వెనుకబడిన మండలాలపై అసహనం వ్యక్తం చేశారు. నెలాఖరులోపు 100 శాతం పన్ను వసూళ్లను సాధించి, రికార్డులను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. లక్ష్యాలను చేరుకోని సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమం (ప్రజాపాలన) పురోగతిని ఆయన నిశితంగా సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల పరిష్కారంలో అలసత్వం వద్దు. మండల స్థాయి అధికారులు ప్రతిరోజూ ఉదయం గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు హాజరు పట్టికను, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని, నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా సమ్మర్ యాక్షన్ ప్లాన్, కంటింజెన్సీ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. బోరుబావుల మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలను తక్షణమే సరిచేయాలని చెప్పారు. ప్రతి ఇంటి వద్ద చెత్తను విధిగా వర్గీకరించి, స్వచ్ఛ గ్రామాలను తయారు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్‌కు చెందిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



## లింగాపూర్‌లో మహిళ అదృశ్యం.. పోలీసులకు భర్త ఫిర్యాదు

**కోటగిరి, మార్చి 09(డిడి9 వార్త):**

లింగాపూర్ గ్రామానికి చెందిన ఒక మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి నుండి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోంకి వెళితే లింగాపూర్ గ్రామానికి చేస్తుందిన బోడ గంగాధర్ భార్య బోడ రాజ్యలక్ష్మి (27) తన ఇద్దరు పిల్లలు కుమార్తె స్నితిక (6), కుమారుడు ప్రన్విత్ (4) లతో కలిసి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన భర్త బోడ గంగాధర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మహిళ మరియు పిల్లల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.







## రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలను కొనసాగిద్దాం

**బోధన్, నిజామాబాద్ 09 మార్చి(డీడీ9 వార్త) :**




విప్లవోద్యమ ప్రస్థానంలో నిబద్ధత కలిగిన నేతగా పనిచేసిన కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 10వ వర్ధంతిని బోధన్ పట్టణం హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ... రవన్న జీవితం విప్లవోద్యమానికి అంకితమని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు. అతివాద, మితవాద ధోరణులు కాకుండా ప్రజా పంథా మార్గమే పేద ప్రజల సమస్యల పరిష్కారానికి సరైనదని ఆయన నమ్మేవారని ఆ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల కార్యదర్శి పడాల శంకర్, ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు సీతారాం, సిహెచ్ రమేష్, టి.లాలయ్య, చంద్రకాంత్, సోంబాలయ్య, ఏ.గంగారాం, బండారి శంకర్, కృష్ణ, తులసమ్మ, సావిత్రి, గంగామణి తదితరులు పాల్గొన్నారు.



## కోటగిరిలో మహిళా ఉపాధ్యాయినులకు ఘన సన్మానం

**నిజామాబాద్, కోటగిరి, మార్చి 09 (డిడి9 వార్త):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని పీఎం జడ్‌పీహెచ్ఎస్ కోటగిరి పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ కోటగిరి మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయినులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోటగిరి మండల ప్రథమ పౌరుడు, గ్రామ సర్పంచ్ బర్ల మధుకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, ముఖ్యంగా విద్యా రంగంలో మహిళా ఉపాధ్యాయినులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని అన్నారు.కార్యక్రమంలో కోటగిరి ఎంఈఓ నాదెండ్ల శ్రీనివాస్ రావు, పీఆర్టీయూ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగోని కిషన్, ఎత్తొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, కోటగిరి మండల అధ్యక్షుడు బర్ల సాయిలు, ప్రధాన కార్యదర్శి ఉదయ్ చంద్ర, కార్యక్రమ చైర్మన్ సుమనా సుచిత్ర, పీఆర్టీయూ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రవీందర్, రాష్ట్ర బాధ్యులు గంగరాజు, శానం సాయిలు, సుధీర్, అర్షద్ హుస్సేన్, రాములమ్మ, జిల్లా బాధ్యులు కుల కర్ణి కృష్ణమోహన్, మండల బాధ్యులు పాషా, మోతిపేట రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, టీఎంఆర్ఐఈఎస్ మరియు కేజీబీవీ ఉపాధ్యాయులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళా ఉపాధ్యాయినులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.



# మమ్మల్ని ఆదుకోరా.. ముత్యాలన్నా!

- **మంచాన పడ్డ వృద్ధుల ఆవేదన**
- **ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ఎదురుచూపు**
- **ఆదుకోవాలని కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్‌కు విజ్ఞప్తి**

**నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

ఆపదలో ఉన్నామంటే చాలు.. నేనున్నానంటూ అండగా నిలిచే ముత్యాల సునీల్ అన్న.. మమ్మల్ని ఆదుకోవాలి. అనారోగ్యంతో మంచాన పడి, వైద్యం చేయించుకోలేక నరకయాతన అనుభవిస్తున్న మాపై కరుణ చూపాలి అంటూ బాల్కొండకు చెందిన ఇద్దరు వృద్ధులు కన్నీటి పర్యంతమవుతున్నారు. నిరుపేద కుటుంబాలకు అండగా ఉండే సునీల్ తమకు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు చేయించాలని వేడుకుంటున్నారు. బాల్కొండ ఎన్టీఆర్ కాలనీకి చెందిన అలిశెట్టి రాజారాం (82) పరమ అయ్యప్ప భక్తుడు. 17 సార్లు శబరిమల యాత్ర చేసిన ఆయన, మూడు సార్లు సైకిల్‌పై, ఒకసారి పాదయాత్రగా వెళ్లిన కృతనిశ్చయపరుడు. గత జనవరిలో అయ్యప్ప దీక్షలో ఉండగా సైకిల్‌పై వెళ్తుండగా కళ్లు తిరిగి పడిపోయారు. ఈ ప్రమాదంలో తుంటి ఎముక విరగడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఇందుకోసం సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చు కావడంతో ఆర్థికంగా చితికిపోయారు. సొంత ఇల్లు లేక, ప్రస్తుతం కిరాయి ఇంట్లో భార్యతో కలిసి మంచానికే పరిమితమయ్యారు. నడవలేని స్థితిలో ఉన్న రాజారాంను శనివారం సీనియర్ జర్నలిస్టు బ్రహ్మరౌతు నర్సింగ్‌రావు, విలేఖరి సూత్రావే సంతోష్ కుమార్‌లు పరామర్శించి ఆయన దీనస్థితిని చూసి చలించిపోయారు. అదే గ్రామానికి చెందిన నెహ్రూ నగర్ కాలనీ నివాసి రాజవ్వ (70) పరిస్థితి కూడా ఇలాగే ఉంది. భర్త సోమాజి నడ్పన్న మరణించగా, కుమారుడు గల్ఫ్ దేశంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రాజవ్వకు ఒక్కసారిగా కాళ్లు, చేతులు పడిపోవడంతో మంచాన పడ్డారు. 2024లోనే ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో ఆమె వైద్యానికి డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. గత 30 ఏళ్లుగా నియోజకవర్గంలో పేదలకు అండగా ఉంటూ, కరోనా కష్టకాలంలో జాతీయ రహదారిపై వెళ్లే బాటసారులకు ఆకలి తీర్చిన సేవాగుణం ముత్యాల సునీల్‌ది అని స్థానికులు కొనియాడుతున్నారు. ప్రస్తుతం మంచాన పడి చావుబతుకుల మధ్య ఉన్న రాజారాం, రాజవ్వల దరఖాస్తులను పరిశీలించి, వెంటనే సీఎం సహాయ నిధి మంజూరయ్యేలా చూడాలని మానవ హక్కుల సామాజిక విభాగం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మరౌతు నర్సింగ్‌రావు, జర్నలిస్టు సంతోష్ కుమార్‌లు ముత్యాల సునీల్‌కు విజ్ఞప్తి చేశారు.





## గర్భిణీల నమోదు పకడ్బందీగా ఉండాలి

- **డిఎంహెచ్ఓ డాక్టర్ బి.రాజశ్రీ**
- **12 వారాల్లోపే పేరు నమోదు చేయాలి**

**నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**



జిల్లాలో గర్భిణీ స్త్రీల నమోదు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, క్షేత్ర స్థాయిలో ఎక్కడా అలసత్వం ప్రదర్శించకూడదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి .రాజశ్రీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నమోదు తక్కువగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందితో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ప్రతి ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో ఏఎన్ఎంలు, ఆశాలు ప్రతిరోజూ గృహ సందర్శన చేస్తూ జనాభా వివరాలను హౌస్ హోల్డ్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. సరైన డేటా అందుబాటులో ఉంటేనే నివేదికల తయారీ సులభమవుతుందని, ముఖ్యంగా గర్భం దాల్చిన 12 వారాలలోపే వారి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ, కొత్తగా పెళ్లిళ్లు అయిన వారిని మరియు ఒకటి లేదా ఇద్దరు సంతానం ఉన్న దంపతులను నిత్యం పర్యవేక్షించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. 49 ఏళ్లు దాటిన మహిళలను అర్హులైన దంపతుల జాబితా నుండి తొలగించాలని ఎల్ఎంపి రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. గర్భిణీల నమోదు తక్కువగా ఉన్న ఎడపల్లి, సాలూర, పెగడపల్లి, దేవగావ్, జోన్ కేశ్వర్, జక్రంపల్లి, వేల్పూరు పీహెచ్‌సీల ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, ఎంఎల్ హెచ్‌పిల పనితీరును ఆమె ప్రత్యేకంగా సమీక్షించడమే కాకుండా, వారు వెంట తెచ్చుకున్న రిజిస్టర్లను స్వయంగా తనిఖీ చేశారు. ప్రతి వెయ్యి జనాభాకు నెలకు సగటున ఇద్దరు గర్భిణీలు నమోదయ్యే అవకాశం ఉంటుందని, ఆ దిశగా ఆశాలు తమ పరిధిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్వేత, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ వెంకన్న, డిడిఎం నారాయణ, హెచ్ఈఓ శ్రీనివాస్, డిహెచ్ఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉత్సాహంగా 5K రన్

**నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక సందడి నెలకొంది. కార్యక్రమం నాలుగో రోజైన సోమవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించారు. మున్సిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సంచాలకుల ఆదేశాల మేరకు ఈ వేడుకను ఉత్సాహంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ బొదిరే నాగమణి స్వామి జెండా ఊపి పరుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాపాలనలో భాగంగా ప్రజలను భాగస్వాములను చేస్తూ ఈ రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. అనంతరం పట్టణంలోని అర్బన్ పార్కును చైర్‌పర్సన్ సందర్శించారు. అక్కడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కంపోస్ట్ ఎరువు తయారీ విధానాన్ని ఆమె నిశితంగా పరిశీలించారు. తడి చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో ఇటువంటి వినూత్న పద్ధతులు ఎంతో దోహదపడతాయని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ ఉన్నతాధికారులు, విద్యార్థులు, యువకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



## ఆత్మహత్యా కు పాల్పడిన వ్యక్తిని కాపాడిన బోధ్ పోలీసులు

- **మద్యానికి బానిసయ్యాడని, తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురైన వ్యక్తి**
- **ధన్నూర్ (బి) ప్రాంతం నందు ఆత్మహత్య ప్రయత్నం.**
- **సమాచారం తెలుసుకున్న వెంటనే డయల్ 100 సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపిన బోథ్ సీఐ డి గురు స్వామి**
- **రేపటి జాబ్ మేళాలో పాల్గొని భవిష్యత్తు ప్రణాళికలు రచించాలని చైతన్య పరిచిన బోథ్ సీఐ**

**ఆదిలాబాద్ జిల్లా బోథ్, మార్చి 9,(డిడి9న్యూస్ ):-**

బోథ్ మండలం కనుగుట్ట గ్రామానికి చెందిన మంత్రి నరసయ్య అనే వ్యక్తి తండ్రి ఇస్త్రారీ మందలించడంతో మనస్థాపానికి గురై ధన్నూర్ బి గ్రామం వద్ద వీడియో కాల్ ద్వారా తల్లిదండ్రులకు ఆత్మహత్య ప్రయత్నం చేసుకుంటున్నాను తెలియజేయడంతో, సమాచారం తెలుసుకున్న బోథ్ సీఐ డి గురు స్వామి వెంటనే బాధితుని సెల్ఫోన్ ఆధారంగా తన ఉన్న లొకేషన్ తెలుసుకొని డయల్ 100 సిబ్బందిని సంఘటన స్థలానికి పంపగా, ఆత్మహత్య చేసుకుంటున్న బాధితున్ని ఆపి పోలీస్ స్టేషన్కు తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకులు మద్యానికి బానిస కాకూడదని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. రేపు జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో పోలీసు హెడ్ క్వార్టర్ లో నిర్వహించనున్న జాబ్ మేళా నందు పాల్గొని తనకు నచ్చిన ఉద్యోగాన్ని చేయవలసిందిగా సూచించారు. దానికి కావలసిన తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రాణ నష్టం కాకుండా కాపాడిన పోలీసులకు గ్రామస్తులు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పోలీసు అధికారి ప్రత్యేకంగా సిబ్బందిని అభినందించారు.



## బోధన్ మున్సిపాలిటీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని 1, 19వ వార్డుల్లో సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, దోమల బెడదను నివారించేందుకు వార్డుల్లోని వీధుల్లో మలాథియాన్ మందును పిచికారీ చేయించారు. ప్రజా రవాణాకు ఇబ్బందికరంగా మారిన ముళ్ల పొదలు, అడవి మొక్కలను యంత్రాలతో తొలగించారు. పట్టణ ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా రాబోయే రోజుల్లో మిగిలిన వార్డుల్లోనూ ఇటువంటి పనులు చేపడతామని మున్సిపల్ అధికారులు తెలిపారు.




## రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలను కొనసాగిద్దాం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

విప్లవోద్యమ ప్రస్థానంలో నిబద్ధత కలిగిన నేతగా పనిచేసిన కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 10వ వర్ధంతిని బోధన్ పట్టణం హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ... రవన్న జీవితం విప్లవోద్యమానికి అంకితమని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు. అతివాద, మితవాద ధోరణులు కాకుండా ప్రజా పంథా మార్గమే పేద ప్రజల సమస్యల పరిష్కారానికి సరైనదని ఆయన నమ్మేవారని ఆ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల కార్యదర్శి పడాల శంకర్, ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు సీతారాం, సిహెచ్ రమేష్, టి.లాలయ్య, చంద్రకాంత్, సోంబాలయ్య, ఏ.గంగారాం, బండారి శంకర్, కృష్ణ,





## శాస్త్రీయ ఆలోచనలతో విద్యార్థుల సృజనాత్మక ప్రదర్శన

**బోధన్, నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

సాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి రాజీ మంజూష ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను ఆమె ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ ఫెయిర్, ఇన్‌స్పైర్, సైన్స్ కాంగ్రెస్ వంటి వేదికలు ఎంతో దోహదపడతాయి. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకుని, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు రుద్ర సంతోష్ యాదవ్, లింబగిరి జోష్ణ, విజయలక్ష్మి, విట్టల్ కాంబ్లే, విజయ్ కుమార్, గంధం సాయిలు, రాజ్ కుమార్, స్వామి, సంగీతరావు, అబ్బయ్య, అంజన, అరుణ్ కుమార్, సుభాని, శోభారాణి, సుధారాణి, లక్ష్మి, వనజ, మేడి రవికుమార్, అక్షయ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## చౌట్ పల్లి పీహెచ్‌సీలో ఉచిత వైద్య శిబిరం

**నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

కమ్మర్ పల్లి మండల పరిధిలోని చౌట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పరిసర గ్రామాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 243 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు వైద్యురాలు డాక్టర్ స్పందన తెలిపారు. వీరిలో 27 మందికి వివిధ రకాల రక్త పరీక్షలు చేయగా, మెరుగైన చికిత్స అవసరమైన 34 మందిని నిజామాబాద్ జీజీహెచ్ రిఫర్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్య పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, గ్రామ సర్పంచ్ మహబూబ్, డీపీఎం వెంకటేశ్, ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రజల నుంచి అందే ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సూచించారు. సోమవారం నాటి కార్యక్రమంలో మొత్తం 103 ఫిర్యాదులు అందగా, వాటిని కలెక్టర్ స్వయంగా స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు. అర్జీదారుల సమస్యలను నిశితంగా పరిశీలించి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.



## విద్యార్థులే నేతలు.. పార్లమెంటుగా మారిన పాఠశాల

**నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

కమ్మర్ పల్లి మండలం చౌట్ పల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణం సోమవారం అచ్చం పార్లమెంటును తలపించింది. విద్యార్థులు ప్రజాప్రతినిధుల వేషధారణలో దేశంలోని కీలక సమస్యలపై గళమెత్తి అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ సమావేశం ఆద్యంతం వాడీవేడిగా సాగింది. ఒకరు ప్రధానమంత్రిగా, మరొకరు స్పీకర్‌గా, మరికొందరు మంత్రులుగా, ప్రతిపక్ష నాయకులుగా పాత్రల్లో ఒదిగిపోయారు. సభలో భాగంగా జరిగిన 'ప్రశ్నోత్తరాల సమయం'లో విద్యార్థులు అడిగిన ప్రశ్నలు, అందుకు సమాధానాలు, బిల్లుల ఆమోదం వంటి ఘట్టాలు పార్లమెంటరీ కార్యకలాపాలపై వారికున్న అవగాహనకు అద్దం పట్టాయి. ఈ సందర్భంగా ఎంఈఓ ఆంధ్రయ్య మాట్లాడుతూ... విద్యార్థులకు మన ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటు పని తీరుపై ప్రత్యక్ష అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. ఇలాంటి కృత్యాల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక అంశాలపై స్పష్టమైన అవగాహన పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# బాధ్యత మరిచిన కేర్ టేకర్.. వేటు వేసిన కలెక్టర్

- **బాధ్యత మరిచిన కేర్ టేకర్.. వేటు వేసిన కలెక్టర్**
- **బాల్కొండ మైనారిటీ, మోడల్ స్కూళ్లలో ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ**
- **పరుష పదజాలం, నిర్లక్ష్యంపై విద్యార్థినులు, సిబ్బంది ఫిర్యాదు**
- **నీటి సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథకు ఆదేశం**

**నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

విద్యార్థుల సంక్షేమం పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. బాల్కొండ మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయం, మోడల్ స్కూళ్లలో సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యతపై ఆరా తీశారు. మోడల్ స్కూల్ తనిఖీ సందర్భంగా పరిస్థితి భిన్నంగా ఉంది. పాఠశాల కేర్ టేకర్ ఎం.వీణ తీరుపై విద్యార్థినులు, సిబ్బంది కలెక్టర్‌కు వరుస ఫిర్యాదులు చేశారు. కేర్ టేకర్ రెగ్యులర్ గా విధులకు రాకపోగా, వచ్చిన రోజున పరుష పదజాలంతో దూషిస్తూ అనుచితంగా ప్రవర్తిస్తున్నారని వారు కన్నీటి పర్యంతమయ్యారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించడం లేదని, హాస్టల్‌లో తీవ్రమైన నీటి ఎద్దడి ఉన్నా పట్టించుకోవడం లేదని విద్యార్థినులు కలెక్టర్ ఎదుట మొరపెట్టుకున్నారు. వెంటనే విచారణ.. తక్షణ తొలగింపు విద్యార్థినుల ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన కలెక్టర్, తక్షణమే విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జీఈసీఓ భాగ్యలక్ష్మి, ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌లు హుటాహుటిన విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. నివేదికలోని వాస్తవాలను నిర్ధారించుకున్న కలెక్టర్, కేర్ టేకర్ వీణను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాఠశాలలో నెలకొన్న నీటి కొరతను శాశ్వతంగా పరిష్కరించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. అంతకుముందు మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, అటెండెన్స్ రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పదో తరగతి తరగతి గదిలో విద్యార్థినులకు గణితంపై ప్రశ్నలు వేసి వారి ప్రతిభను పరిశీలించారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థినులను అభినందిస్తూ చాక్లెట్లు పంచిపెట్టారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ ఏకాగ్రతతో చదివి, గతేడాది మాదిరిగానే ఈసారి కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా అత్యుత్తమ గ్రేడ్లతో నిలవాలని స్ఫూర్తిని నింపారు. తాను మరోమారు ఆకస్మిక తనిఖీకి వస్తానని, పాఠశాల నిర్వహణలో మరింత మెరుగైన ఫలితాలు ఉండాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.







# జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట : పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

- **ఇళ్ల స్థలాల కలను నిజం చేస్తాం**

**నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**

సమాజంలో చైతన్యానికి ప్రతిరూపాలుగా, అక్షర సైనికులుగా నిలిచే జర్నలిస్టుల కష్టాలను గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పాత్రికేయుల చిరకాల స్వప్నమైన ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. నిజామాబాద్ నగరంలోని బస్వా గార్డెన్‌లో సోమవారం జరిగిన నిజామాబాద్ అర్బన్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు నాలుగో స్తంభంగా విరాజిల్లుతున్నారని ఆ వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వార్తల సేకరణలో వాస్తవాలకు ప్రాధాన్యతనిస్తూ, పేదల గొంతుకగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. టీఆర్పీ రేటింగ్‌ల మాయలో పడకుండా, సామాజిక బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో అలాగే క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులే వారధులని ఆయన కొనియాడారు. కలుషితమవుతున్న కొందరు రాజకీయ నేతలను తమ కలం పోరాటంతో గాడిలో పెట్టాల్సిన బాధ్యత మీడియాపై ఉందని ఆయన గుర్తు చేశారు. కేశాపూర్‌లో స్థలాల పరిశీలన.. నిజామాబాద్ నగర జర్నలిస్టులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాల అంశాన్ని తాను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకున్నానని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, సాధ్యసాధ్యాలను పరిశీలిస్తామని చెప్పారు. ముఖ్యంగా నగర శివారులోని కేశాపూర్ వద్ద గల ప్రభుత్వ భూమిని జర్నలిస్టులకు కేటాయించే విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఆర్డీవోలతో నేడే సుదీర్ఘంగా చర్చించి తదుపరి కార్యాచరణను ఖరారు చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో జర్నలిస్టుల వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జర్నలిస్టుల హెల్త్ కార్డుల పునరుద్ధరణ, ఇతర సంక్షేమ పథకాల విషయంలోనూ ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆయన వివరించారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ఎమ్మెల్సీగా జర్నలిస్టుల ప్రతి సమస్యపై తాను పోరాడుతానని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ ప్రసంగిస్తూ, పాత్రికేయుల కృషిని అభినందించారు. కొత్త కార్యవర్గం బాధ్యతలు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పంచ రెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా వాగ్మరే సుభాష్, కోశాధికారిగా రాజ్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బొత్స రాజుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.






## శేష వాహనంపై ఇందూరు తిరుమల గోవిందుడు

**నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**



ఇందూరు తిరుమల గోవింద వనమాల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన సోమవారం సాయంత్రం స్వామివారు అత్యంత ప్రీతిపాత్రమైన శేష వాహనంపై ఆసీనులై భక్తులకు కనువిందు చేశారు. భక్తజన సందోహం మధ్య, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. ఈ పవిత్ర వేడుకలకు శ్రీశ్రీశ్రీ అహోబల జీయర్ స్వామివారు మరియు శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామివార్లు విచ్చేయడంతో ఆలయం ఆధ్యాత్మిక పరిమళాలతో నిండిపోయింది. స్వామివారి సేవలో జీయర్ స్వామివార్లు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు వారి అనుగ్రహ భాషణలు అందించారు. స్వామివారి ఈ కమనీయ దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు దిల్‌రాజు దంపతులు, శిరీష్‌రెడ్డి దంపతులు, నరసింహారెడ్డి దంపతులు, విజయసింహారెడ్డి దంపతులు ఈ వేడుకలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. బలగం సినిమా ఫేమ్ నటుడు మధు, స్థానిక గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. శేష వాహనంపై ఊరేగుతున్న గోవిందుని చూడడానికి భక్తులు క్యూ కట్టారు.



## అక్రమ ఇసుక డంపుపై రెవెన్యూ అధికారుల దాడి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 09 మార్చి(డీడీ9 వార్త) :**


రెంజల్ మండలంలోని బోర్గం శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును రెవెన్యూ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 20 ట్రాక్టర్లకు సరిపడా ఇసుకను గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న అధికారులు, వెంటనే రంగంలోకి దిగారు. ఈ ఆకస్మిక తనిఖీల గురించి ఇన్ ఛార్జ్ తహశీల్దార్ శ్రావణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. అక్రమంగా ఇసుకను నిల్వ ఉంచినట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని తనిఖీ చేశామని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 20 ట్రాక్టర్ల ఇసుకను గుర్తించి సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు. ఇసుకను తరలించేందుకు ప్రయత్నించినవారిని గుర్తించేందుకు విచారణ చేపట్టినట్లు చెప్పారు. ఈదాడుల్లో రెవెన్యూ అధికారులు ఈశ్వర్, నిఖిల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## పోతంగల్ మండల నూతన తాసిల్దార్ ... రంజిత్

**కోటగిరి / పోతంగల్ మార్చి 9 (డిడి9 వార్త)**

పోతంగల్ మండల నూతన తాసిల్దార్ గా రంజిత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్చార్జి తాసిల్దార్ గా ఉన్న గంగాధర్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం నూతన తాసిల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తానని, కార్యాలయంలో ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని మధ్యవర్తుల్ని సంప్రదించవద్దని ఆయన పత్రిక ముఖంగా తెలిపారు.




# నన్ను ఉత్తేజపరిచేది ఆ స్వేచ్ఛే!

'లోకా చాప్టర్ 1: చంద్ర'... తొలి నాయికా ప్రాధాన్య చిత్రంతో బాక్సాఫీస్ మంచి వసూళ్లు సాధించి రికార్డు సృష్టించింది హీరోయిన్ కల్యాణి ప్రియదర్శన్. ఫీమేల్ సూపర్ హీరో నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకి త్వరలో రూపొందనున్న సీక్వెల్‌లో కూడా నటించనున్నట్లు ఇటీవలే స్పష్టం చేసిందీ తార. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది. "చిత్రసీమలో ఆటుపోట్లను చూస్తుంటాము. పరిస్థితులు అనుకూలించనప్పుడు అవి ఒక వ్యక్తిని ఎంతలా నాశనం చేస్తాయో కూడా మనకి తెలుసు. అయినా సరే, సినిమా పట్ల నాకున్న ప్రేమ వల్లే చిత్రపరిశ్రమనే ఎంచుకున్నాను. నేను నా వ్యక్తిగత విషయాలను ప్రైవేట్‌గానే ఉంచాలనుకుంటా. తెరపై నటిగా కనిపిస్తున్నప్పటికీ ఇప్పటికీ నాకు స్టేజ్ ఫియర్ చాలానే ఉంది. అలానే ఇండస్ట్రీలో నన్ను ఉత్తేజపరిచేది ప్రేక్షకాదరణ ఒకటే కాదు.. స్వేచ్ఛ. నేను కోరుకునే కథలను ఎంచుకునే స్వేచ్ఛ నాకు లభించడం. చాలామంది నిర్మాతలు కథల కంటే స్టార్లకు మద్దతు ఇవ్వడాన్ని ఎక్కువగా ఇష్టపడుతున్నారని అనిపిస్తుంది. వారికి నేను కూడా అలానే మద్దతునిస్తూ.. నా కథల ఎంపికలో స్వేచ్ఛ పొందుతాన"ని చెప్పుకొచ్చింది. కల్యాణి ప్రస్తుతం కార్తి హీరోగా తెరకెక్కుతున్న 'మార్షల్'తో పాటు ఇంకా పేరు ఖరారు చేయని ఓ తమిళ చిత్రంలో నటిస్తుంది.



# ఆ స్టార్ హీరోతో కలిసి నటించడం నా అతిపెద్ద కల


టాలీవుడ్ యంగ్ అండ్ సెన్సేషనల్ బ్యూటీ రితికా నాయక్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. చాలా తక్కువ సినిమాలే చేసినప్పటికీ, తన క్యూట్ లుక్స్, అద్భుతమైన నటనతో కుర్రాళ్ల మనసు దోచుకుంది. 'అశోకవనంలో అర్జున కళ్యాణం' మూవీతో తెలుగు తెరకు పరిచయమైన ఈ చిన్నది, మొదటి సినిమాతోనే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్‌గా వచ్చిన 'మిరాయ్' చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని, టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ల లిస్టులో చేరిపోయింది. ప్రస్తుతం రితికా నాయక్ కెరీర్ పరంగా ఫుల్ ఫామ్‌లో ఉంది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న 'కొరియన్ కనకరాజు' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. యాక్షన్, డ్రామా నేపథ్యంలో వస్తున్న ఈ చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ మూవీతో రితికా రేంజ్ పెరగడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు.



ఇక సినిమాలతో బిజీగా ఉన్న రితికా, తాజాగా.. ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన మనసులో మాటను బయటపెట్టింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకుంది. "అల్లు అర్జున్ గారితో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం నా అతిపెద్ద కల. ఆయన సినిమాలో నటించే అవకాశం వస్తే నేను అస్సలు వదులుకోను. ఆ అవకాశం వస్తే అది చిన్న పాత్ర అయినా సరే, చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని చెప్పుకొచ్చింది.

# వివాహం తర్వాత మళ్లీ రంగంలోకి విజయ్!

రష్మికతో కలిసి ఇటీవలే వివాహ బంధంలోకి అడుగు పెట్టారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. గత నెల రోజులుగా ఈ పెళ్లి పనులతోనే తీరిక లేకుండా గడిపిన ఆయన ఇప్పుడు మళ్లీ సెట్‌లోకి అడుగు పెట్టేందుకు సమాయత్తమవుతున్నారు. ప్రస్తుతం ఆయన.. రష్మిక కలిసి నటిస్తున్న హ్యాట్రిక్ చిత్రం 'రణబాలి'. రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే కొంత చిత్రీకరణ చేసుకున్న ఈ సినిమా ఈ వారం నుంచే కర్నూల్‌లో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనుంది. విజయ్ ఈ నెల 12న ఈ చిత్ర సెట్‌లోకి అడుగు పెట్టనున్నట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో భాగంగా ఆయనతో పాటు ముఖ్య తారాగణంపై టాకీ పార్ట్ చిత్రీకరించనున్నట్లు తెలిసింది. 18541878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనలతో ఈ సినిమా రూపొందుతోంది. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో విజయ్ ఓ యోధుడిగా కనిపించనున్నారు. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక అలరించనుంది. ఈ



చిత్రం సెప్టెంబరు 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకి సంగీతం: అజయ్ అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.

# 'దండోరా' ఇక్కడితో ఆగే సినిమా కాదు.. ముమ్మందు చాలా అవార్డులు వస్తాయి

తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 'గద్దర్ అవార్డులు 2025'లో 'దండోరా' సత్తా చాటుకుంది. మూడు కేటగిరీల్లో 'దండోరా' అవార్డుల్ని కొల్లగొట్టేసింది. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ నిర్మాణంలో మురళీకాంత్ 'దండోరా' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు ముఖ్య పాత్రల్ని పోషించారు. తమ సినిమాకు ప్రభుత్వం ప్రకటించిన అవార్డులు, ఇచ్చిన గుర్తింపు సందర్భంగా ఆదివారం చిత్రయూనిట్ థాంక్యూ మీట్ నిర్వహించింది.

ఈ థాంక్యూ మీట్‌లో శివాజీ మాట్లాడుతూ .. 'మా 'దండోరా' సినిమాని గుర్తించి అవార్డుల్ని ఇచ్చిన జ్యూరీకి, తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఎన్టీఆర్ గారు వేసిన ట్వీట్‌తో తెలుగు వారందరికీ ఈ చిత్రం దగ్గరైంది. మార్క్ కె రాబిన్ గారికి అవార్డు రావడం ఆనందంగా ఉంది. నాకు ఈ చిత్రంలో అవకాశం ఇచ్చిన బెన్నీ గారికి థాంక్స్. ఈ మూవీ కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ ఈ అవార్డుల్లో భాగం ఉంటుంది. మురళీగారు 'దండోరా' కథని, మూవీని మా కోసమే తీశాడనిపిస్తుంది. ఈ పాత్ర కోసం, లుక్ కోసం నేను చాలా వరకు రాత్రి పూట రెండు, మూడు గంటలే నిద్రపోయేవాడ్ని. నటన అంటే దైవంతో సమానం. రాధ్య అనే పాప పాత్ర లేకపోయి ఉంటే ఈ సినిమా నేను చేసే వాడ్ని కాదు. ఈ మూవీ ఇంకా చాలా దూరం వెళ్తుందని నమ్ముతున్నాను. ఇక్కడితో ఆగే సినిమా అయితే కాదు. ముమ్మందు చాలా అవార్డులు వస్తాయని ఆశిస్తున్నాను' అని అన్నారు. దర్శకుడు మురళీకాంత్ మాట్లాడుతూ.. 'మా 'దండోరా' సినిమాకు ఇలాంటి గుర్తింపు ఇచ్చిన జ్యూరీకి, ప్రభుత్వానికి థాంక్స్. ఇలాంటి అవార్డులు, గుర్తింపు వచ్చిన సమయాల్లోనే మన వద్ద ఉన్న టాలెంట్ గురించి అందరికీ తెలుస్తుంది. శివాజీ గారి వల్లే ఈ చిత్రం ఈ స్థాయికి వచ్చింది' అని అన్నారు. కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొంది



# త్రిషకు క్షమాపణలు చెప్పిన దర్శకుడు

ఇటీవల చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్‌లో త్రిషను ఉద్దేశించి నటుడు, దర్శకుడు పార్తిబన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై త్రిష కూడా పరోక్షంగా స్పందించడంతో ఆయన మరో పోస్ట్ పెట్టారు. "ఈ విషయంలో జరిగినదంతా తప్పుగా భావించారు. ఇప్పుడు నాకు పశ్చాత్తాపపడటం తప్ప మరో మార్గం లేదు" అని తన పోస్ట్‌లో రాశారు. దీంతో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడినట్లు అయింది.

అసలేం జరిగిందంటే.. గత కొన్ని రోజులుగా త్రిష ప్రేమకు సంబంధించిన రూమర్స్ వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్‌తో కలిసి ఓ వివాహ వేడుకకు హాజరుకావడం ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. ఓ ఈవెంట్‌లో త్రిష గురించి పార్తిబన్ మాట్లాడుతూ.. "ఆమె కొన్ని రోజులు ఇంట్లోనే ఉండటం మంచిది. ఎందుకంటే ఆమె బయటకు వస్తే ఎక్కడ లేని సమస్యలు వస్తున్నాయి" అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై త్రిష పరోక్షంగా స్పందించారు. "చేతిలో మైక్ ఉంది కదా అని మాట్లాడితే కామెడీ అవ్వదు. అది కేవలం మూర్ఖత్వమే" అని పోస్ట్ పెట్టారు.



# ఆమె నమ్మేది చట్టాన్నే... గన్‌ని కాదు

నాయికా ప్రధానమైన సినిమాలు మహిళా శక్తికి అద్దం పడుతుంటాయి. కథానాయకులతో కలిసి ఆడిపాడటానికే పరిమితం కాకుండా... తమ చుట్టూనే కథల్ని తిప్పుకుంటూ సందడి చేస్తుంటారు కథానాయికలు. అలా హీరోలకి దీటుగా సూపర్‌స్టార్స్‌గా గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లు తెలుగులో చాలామందే. అందుకే నాయికా ప్రధానమైన సినిమా ఎప్పుడూ ఒక్కటైనా సెట్స్‌పై ఉంటుంది. విజయాలకి కేరాఫ్‌గా నిలుస్తున్న సంయుక్త మేనన్ ప్రధాన పాత్రధారిగా 'ది బ్లాక్ గోల్డ్' రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకి యోగేశ్ కేఎంసీ దర్శకుడు. మాగంటి పిక్చర్స్‌తో కలిసి హాస్య మూవీస్ పతాకంపై రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఈ సినిమాలోని పోస్టర్‌ని విడుదల చేసింది చిత్ర బృందం. అందులో తుపాకి ఎక్కుపెట్టి శక్తిమంతమైన అవతారంలో కనిపిస్తోంది సంయుక్త. 'ఆమె చట్టాన్నే నమ్ముతుంది, గన్‌ని కాదు...' అనే శీర్షికతో విడుదలైన ఆ పోస్టర్ సినిమా కథపైనా ఆసక్తిని రేకెత్తిస్తోంది. "యాక్షన్ డ్రామాతో రూపొందుతున్న చిత్రమిది. సరికొత్త కథనం, వాణిజ్యాంశాలు చిత్రానికి ప్రధాన బలం. ఒక షెడ్యూల్ మినహా చిత్రీకరణ పూర్తయింది. ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ"ని సినీ వర్గాలు పేర్కొన్నాయి. మురళీశర్మ, నాసర్, మనీష్ వాద్వా, రాంకి, రవీంద్ర విజయ్, ఆడుకలం నరేన్, బి.వి.ఎస్.రవి, కృష్ణచైతన్య, చంద్రిక రవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సామ్‌సీఎస్, ఛాయాగ్రహణం: ఎ.వసంత్.



# స్టార్ హీరోపై కేసు వేయనున్న డైరెక్టర్? కోలీవుడ్‌లో కలకలం రేపుతున్న 'కరుప్పు' వివాదం!

స్టార్ హీరో సూర్య నటిస్తున్న 45వ చిత్రం 'కరుప్పు'. ప్రస్తుతం తమిళ సినీ పరిశ్రమలో ఈ సినిమా రిలీజ్ హాట్ టాపిక్‌గా మారినట్లు తెలుస్తుంది. ఆసక్తికరమైన యాక్షన్‌ఫాంటసీ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం, షూటింగ్ పూర్తయినా విడుదల కాకపోవడంతో సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని 'డ్రీమ్ వారియర్ పిక్చర్స్' పతాకంపై ఎస్.ఆర్. ప్రభు, ఎస్.ఆర్. ప్రకాష్‌బాబు నిర్మిస్తున్నారు. ఇందులో త్రిష కథానాయికగా నటిస్తుండగా, సాయి అభ్యంకర్ సంగీతాన్ని అందిస్తున్నారు. 2025 నవంబర్ నాటికే సినిమా పనులన్నీ పూర్తయ్యాయని సమాచారం.

ప్రస్తుతం ఈ సినిమా నిర్మాత ఎస్.ఆర్. ప్రభు, హీరో సూర్యపై దర్శకుడు ఆర్జే బాలాజీ కేసు వేయాలని భావిస్తున్నట్లు న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమా పూర్తయినా వ్యక్తిగత కారణాలతో నిర్మాత కావాలనే ఆలస్యం చేస్తున్నారని సమాచారం. ఆర్జే బాలాజీకి ఇవ్వాల్సిన పూర్తి పారితోషికం ఇంకా ఇవ్వలేదని, OTT డీల్ క్లోజ్ అయ్యాకే సెటిల్ చేస్తామని నిర్మాత చెప్పడం వల్ల ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయని సినీ వర్గాల సమాచారం. ఈ ఆలస్యం వల్ల దర్శకుడి కెరీర్‌కు నష్టం జరుగుతోందని, సినిమా పొటెన్షియల్ వృథా అవుతోందని ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదాలపై నిర్మాణ సంస్థ నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. ఆర్జే బాలాజీకి, నిర్మాతలకు మధ్య ఎటువంటి విభేదాలు లేవని, ఇవన్నీ కేవలం పుకార్లేనని వారు కొట్టిపారేస్తున్నారు. ఈ వివాదాలన్నీ సమసిపోయి సినిమా థియేటర్లలోకి వస్తే సూర్య ఖాతాలో మరో హిట్ పడటం ఖాయమని సూర్య ఫ్యాన్స్ భావిస్తున్నారు.



# కథ కుదిరినట్లేనా?

అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ కలయికలో సినిమా ఎప్పట్నుంచో ప్రచారంలో ఉంది. సూపర్‌మ్యాన్ తరహా కథతో సినిమా తెరకెక్కే అవకాశం ఉన్నట్టు కూడా పరిశ్రమలో చర్చ సాగింది. అయితే అల్లు అర్జున్ వరుసగా తమిళ దర్శకుడు అట్లీ, లోకేశ్ కనగరాజ్‌లతో సినిమాలకు పచ్చజెండా ఊపడంతో, బసిల్ జోసెఫ్‌తో సినిమా గురించి చర్చకు బ్రేక్ పడింది. ఇటీవల జరిగిన అల్లు శిరీష్ పెళ్లి వేడుకకు బసిల్ జోసెఫ్ హాజరు కావడంతో మరోసారి ఆయన, అల్లు అర్జున్ కలయికలో సినిమా తెరపైకొచ్చింది. ఇద్దరూ కలిసి సినిమా చేయడం ఖాయమనే సంకేతాలు వచ్చినట్టైంది. బసిల్ జోసెఫ్ మలయాళంలో కథానాయకుడిగా నటిస్తూనే, దర్శకుడిగా పలు విజయాల్ని అందుకున్నారు.

